## క్లుప్తంగా

### ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయబాబు



మల్కాపురం: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొక్కిలగడ్డ విజయబాబు నియమితులయ్యారు.59వ వార్డు శాంతిగిరికాలనీ ప్రాంతానికి చెందిన విజయబాబు తొలి నుంచి బీజేపీలో క్రియాశీలక సభ్యుడిగా వ్యవహరిస్తూ జిల్లా స్థాయి పదవులు పొందారు. రాష్ట్ర కమిటీలో చోటు దక్కడంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు శుక్రవారం ఆయన్ను అభినందించారు.

### ఘనంగా ఇంటర్నేషనల్ చెఫ్ డే



ఎఫ్‌సీఐలో తయారు చేసిన కేకులతో విద్యార్థులు, అధ్యాపకులు

ఆరిలోవ: విశాఖ వేలీ స్కూల్ సమీపంలోని ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో ఇంటర్నేషనల్ చెఫ్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి విద్యార్థులు వివిధ రకాల వంటకాలు, కేకులు, బిస్కెట్లు తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు తయారు చేసిన కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ కె.వి.రమణ, అధ్యాపకులు రవి, కుముదిని, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉక్కు పరిరక్షణకు నవంబర్ 8న నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భాగంగా నవంబర్ 8న నిర్వహించనునన భారీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ప్రైవేటీకరణ వ్యతిరేక నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న దీక్షలు నవంబర్ 8వ తేదీకి వెయ్యి రోజులకు చేరుతుందన్నారు. ఆ రోజు జరగనున్న కార్యక్రమం కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా ఉండాలన్నారు. ఉక్కు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాటు పాల్గోవాలని కోరారు. కార్యక్రమంలో కారు రమణ, ఆకుల నూకరాజు, బీఎంకె నాయక్, నర్సింగరావు, ఆర్.కోటేశ్వరరావు, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ ఎం.అబ్రహం సంపాదకత్వం వహించిన ›యూత్ పార్టిసిపేషన్ ఇన్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఎడాప్షన్‌‹ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. విపత్తు నిర్వహణపై విభిన్న నిపుణులు రచించిన 25 పరిశోధన పత్రాలను ఈ పుస్తకంలో ప్రచురించారు. విపత్తులు, పర్యావరణ మార్పులు, యువత భాగస్వామ్యం తదితర అంశాలను వీటిలో చర్చించారు. వర్తమాన సమాజంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశంపై పుస్తకాన్ని తీసుకురావడంపై సంపాదకులను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం లక్ష్యం

- వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్
- ప్రతీ ఒక్కరు వైద్య సేవలు వినియోగించుకోవాలని పిలుపు
- బుచ్చిరాజుపాలెం,పాత గోపాలపట్నంలో వైద్య శిబిరాల పరిశీలన

గోపాలపట్నం/విశాఖ విద్య: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, ఏపీ ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రాంగణంతో పాటు పాత గోపాలపట్నంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆయన సందర్శించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి మాసేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతీ గదిలోకి వెళ్లి అక్కడ ఏర్పాట్లు, ప్రజలకు వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఏ ఏ ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారో జీవీఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షల కేంద్రాలు, మందుల పంపిణీ స్టోర్‌ను పరిలించారు.



బుచ్చిరాజుపాలెంలో వైద్యం కోసం వచ్చిన బాలుడి వివరాలు తెలుసుకుంటున్న ఆనంద్ కుమార్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉన్నప్పు సమాజం అభివృద్ధి సాధ్యమన్నారు. అందరికీ వైద్య సేవలు అందించాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇలాంటి ఆలోచన చేశారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 91,92 వ వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, వార్డు ఇన్‌చార్జి చుక్క ప్రసాదరెడ్డి, సీనియర్ నాయకులు నమ్మి శ్రీను, శ్రీనివాసరాజు, జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణం రాజు, నమ్మి వెంకటకృష్ణమూర్తి యాదవ్, దేవర్ల సత్యనారాయణ, పొట్లూరు శంకరరావు, పైడిరాజురెడ్డి, కడితి రాజు, తాతారావు, పసుపురెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు బుచ్చిరాజుపాలెం శిబిరాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.



బుచ్చిరాజుపాలెంలో మందులను పరిశీలిస్తున్న ఆనంద్ కుమార్



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా**

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని కార్పొరేటర్ ముర్రు వాణినానాజీ అన్నారు. ఐటీఐ జంక్షన్ భవాని గార్డెన్స్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో శుక్రవారం జరిగిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాన్ని ఆమె పర్యవేక్షించారు. 275 మంది రోగులకు దంతాలు, చెవి, ముక్కు, గొంతు, కంటి, ఎముకులు, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ ఏఎల్ శాంతి తెలిపారు. ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రోగులకు, వైద్యసిబ్బందికి భోజనం అందించారు. కార్యక్రమంలో పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, యూపీహెచ్‌సీ ఫార్మసిస్ట్ సింహాచలం, 52,56,57 వార్డుల వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్‌యాదవ్, శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బాలుడిని పరీక్షిస్తున్న వైద్యుడు



పాత గోపాలపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందజేస్తున్న ఆనంద్‌కుమార్



మందులు అందజేస్తున్న కార్పొరేటర్ వాణి

### ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలి



ఇందిరానగర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు

గోపాలపట్నం: ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించి సీజనల్ వ్యాధులను నియంత్రిద్దామని జోన్‌–8 ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు అన్నారు. కు జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లో శానిటేషన్, మలేరియా విభాగాలు సంయుక్తంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మంచి నీటినిల్వలు లేకుండా వారానికి ఒక రోజు పాత్రలను శుభ్రం చేసుకుని ఎండబెట్టాలని సూచించారు. అలా చేయడం వల్ల దోమల లార్వా పెరగకుండా ఉంటుందన్నారు. తడి పొడి చెత్త వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ రమణ, మలేరియా ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు, గోపి, సచివాలయ కార్యదర్శి చైతన్య కుమారి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి మిజోరం గవర్నర్ పర్యటన

మహారాణిపేట: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన శనివారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంటారు. 23వ తేదీ వరకు స్థానికంగా జరిగే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 24న హైదరాబాద్ వెళ్లి అక్కడ కార్యక్రమాల అనంతరం 26న తిరిగి విశాఖపట్నం వస్తారు. 30న ఉదయం విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ నుంచి కోల్‌కతా మీదుగా ఐజ్వాల్ వెళ్లనున్నారు. ఈ మేరకు సంబంధిత ఏర్పాట్లు చేయాలంటూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

## జాబ్‌మేళాలో 57 మంది ఎంపిక

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్(ఏపీ) ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. వెల్‌కేర్ ఫార్మా, సిద్ధి వినాయక ఇంజినీరింగ్ వర్క్స్, దసపల్లా హోటల్, టీసీఎస్ డిజిటల్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, పోలినేని అసోసియేట్స్, అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 411 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 122 మంది అభ్యర్థులు హాజరైతే 57 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు.



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు, సంస్థ ప్రతినిధులు

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మల్కాపురం: పొదుపు సంఘాల మహిళలు చిన్న స్థాయి పరిశ్రమలు ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. వార్డు పరిధిలోని ఆర్‌పీలు,క్లస్టర్ మెంబర్లు,గృహసారథులు,సచివాలయాల కన్వీనర్లతో ఆర్‌కేపురంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. దీనిలో భాగంగా వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు దశల వారీగా రుణమాఫీ చేస్తుందన్నారు. సభ్యులు పొందిన రుణాలతో తమకు నచ్చిన చిన్నపాటి వ్యాపారం సాగించి సొంతకాళ్లపై నిలబడే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బద్రీనాథ్, పార్టీ వార్డు అధ్యక్షుడు జీవీఎస్ఎన్.రాజు (కేబుల్ వాసు),మధుబాబు,చట్టి నూకరాజుయాదవ్,మంగ,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుధ

### పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలి

ఉక్కునగరం: పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షలు వెయ్యి రోజులకు చేరుకుంటున్న సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కార్మికులను చైతన్య పరిచేందుకు విభాగాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పోరాటంలో పాల్గొవడం వల్ల మాత్రమే ప్రభుత్వం వెనక్కి తగ్గుతుందన్నారు.

# దుర్గామాతకు జేజేలు

- భక్తిశ్రద్ధలతో సరస్వతీపూజలు
- ఆలయాల్లో అన్నసమారాధనలు

విశాఖ విద్య: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూలా నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవిగా పూజలందుకున్నారు. పలు చోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు.

- జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీదుర్గాలమ్మ– శ్రీబంగారమ్మ ఆలయంలో సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు అధిక సంఖ్యలో సరస్వతీ దేవి అవతారంలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నవకలశ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు బుజ్జి, జగన్, సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.
- 52వ వార్డు అంబేడ్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారికి నిర్వాహకులు శ్యామ్ ఆధ్వర్యంలో చేసిన గాజుల అలంకరణ ఆకట్టుకుంది.
- 90వ వార్డు విమాన్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద భవానీ భక్తులు పూజలు నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి నాగు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**దుర్గమ్మను దర్శించుకున్న బెహరా**

గోపాలపట్నం: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గోపాలపట్నం శంకర సినిమాహాలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గా దేవిని శుక్రవారం జీవీఎంసీ కోఆప్షన్ బెహరా భాస్కరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు శ్రీ శివదుర్గ మండప కమిటీ సభ్యులు అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు లంక కార్తీక్, కోటా ప్రసాద్, అప్పలరాజు, శివ, సందీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం



విమాన్ నగర్‌లో ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మవారు



సరస్వతీదేవి అవతారంలో కొలువుదీరిన దుర్గమ్మ

**సరస్వతీదేవిగా దుర్గమ్మ**

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద డేరింగ్ అండ్ డేషింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవి పూజల్లో శుక్రవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. చిన్నారులతో సామూహిక అక్షరాభాస్యం చేయించారు. ఇదే ప్రాంతంలో అల్లరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంతో పాటు గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు.

- ప్రకాష్‌నగర్ వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని పూజలు చేశారు.
- 59వ వార్డు హిమాచల్‌నగర్ మండపం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

**సరస్వతీదేవిగా దుర్గమ్మ**

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు దుర్గానగర్ దుర్గమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సరస్వతీ పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు మహా కుంభాభిషేకం నిర్వహించారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వీవీఎల్ సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో విద్యార్థుతో సరస్వతీ పూజ చేయించారు. గొల్లకంచరపాలెం శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు చిన్నారులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు యలమంచిలి వెంకటరావు, పాత్రపిల్లి వెంకటరమణ, పల్లా పెంటారావు, సానబోయిన సంపత్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న అయితంశెట్టి గోపి, ఆళ్ల పైడిరాజు తదితరులు

**చంద్రనగర్‌లో ప్రత్యేక పూజలు**

గోపాలపట్నం: దుర్గా నవరాత్రులు సందర్భంగా జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. పూజల్లో పాల్గొన్న చిన్నారులకు మంచి విద్య అబ్బాలని ఆశీర్వదించారు. పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందించారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు దర్శించుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బుజ్జి, గణేష్, షేక్ రహమాన్, ముకుంద, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న బెహరా భాస్కరరావు

**వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు**

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. యారాడలోని భూలోకమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని పెన్నులు, పుస్తకాలతో సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

- జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో లంబోధర యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారిని విశేషంగా అలంకరించి కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.
- మూలా నక్షత్ర సర్వదినాన్ని పురస్కరించుకుని షిప్‌యార్డ్ సమీప సాగరి కనకదుర్గాదేవిని శుక్రవారం సరస్వతీ దేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**భారీ అన్నసమారాధన**

జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు.



పెన్నులు, పుస్తకాల అలంకరణలో భూలోకమ్మ



సరస్వతీదేవి అలంకరణలో దుర్గాదేవి



సరస్వతీదేవిగా సాగరి కనకదుర్గ అమ్మవారు

## బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

కంచరపాలెం: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. కంచరపాలెం పరిధిలో ధర్మానగర్, తిక్కవానిపాలెం, ఆర్పీపేట, కంచరపాలెం, కప్పరాడ, కె.కాలనీ ప్రాథమిక, రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలల పరిధిలో శుక్రవారం ఆమె పర్యటించారు. పలు డ్రాప్ అవుట్ల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి మానేసిన విద్యార్థులను తప్పకుండా బడికి పంపాలని వారిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. దసరా సెలవులు అనంతరం పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో ఫోన్‌లో మాట్లాడి డ్రాప్ అవుట్లు బడిలో చేరేలా బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎస్ఎస్ఏ సిబ్బంది గీత, సీఆర్పీలు లంక చైతన్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

## మెరిసిన మనీష్, శశికాంత్

**ఎస్ఎంఏ టోర్నీలో ఆంధ్రా జట్టు విజయం**

విశాఖ స్పోర్ట్స్: సయిద్ ముస్తక్ అలీ(ఎస్ఎంఏ) ట్రోఫీలో విశాఖ కుర్రాళ్లు మెరిశారు. రాంచీ వేదికగా శుక్రవారం జరిగిన టీ–20 మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 145 పరుగుల తేడాతో అరుణాచల్‌ప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఆంధ్రా తొలుత బ్యాటింగ్ చేసి నాలుగు వికెట్లకు 228 పరుగులు చేసింది. విశాఖ కుర్రాడు భరత్(కెప్టెన్) మూడు పరుగులకే బౌల్డ్ కాగా.. రషీద్ సెంచరీ నమోదు చేశాడు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ ఎనిమిది వికెట్లు కోల్పోయి 83 పరుగులే చేసింది. విశాఖకు చెందిన శశికాంత్ రెండు వికెట్లు, జి.మనీష్ పొదుపుగా బౌలింగ్ చేసి ఓ వికెట్ సాధించాడు. సీ గ్రూప్‌లో ఆడుతున్న ఆంధ్రా జట్టు నాలుగు పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా మనీష్ ›సాక్షి‹తో మాట్లాడుతూ ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసి.. నాలుగు పరుగులిచ్చి ఓ వికెట్ తీయడంతో బెస్ట్ బౌలింగ్ రికార్డుగా నమోదైందన్నారు. ఎస్ఎంఏ ట్రోఫీలో ఇప్పటి వరకు ఈ రికార్డు ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు.